కార్యదర్శులతో సమావేశం

ప్రజాశక్తి -అనంతగిరి:స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం పంచాయతీ, సచివాలయం కార్యదర్శులకు సమీక్షా సమావేశం ఏర్పాటు చేశామని ఎంపీడీవో ఏవివి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు, సచివాలయం సిబ్బంది పనితీరుపై సూచనలు అందించామని ఆయన తెలిపారు. సర్వేలు వేగవంతం చేయాలన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

విజేత శ్రీనివాసులు నాయుడు

కౌంటింగ్ కేంద్రం వద్ద అనుచరులతో శ్రీనివాసులు నాయుడు

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో పిఆర్‌టియు అభ్యర్థి గెలుపు
- టిడిపి, జనసేన బలపరిచిన రఘువర్మ ఓటమి
- టీచర్లలో అధికార పార్టీపై వ్యతిరేకత
- 9 రౌండ్ల వరకూ సాగిన కౌంటింగ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం గెలుపు విషయంలో ఉత్కంఠ వీడింది. అధికారంలో ఉన్న తెలుగుదేశం, జనసేనకు ఈ ఎన్నికల్లో గురువులు గట్టి గుణపాఠం నేర్పినట్టయింది. ఆ పార్టీలు బలపరిచిన ఎపిటిఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మను టీచర్లు ఓడించారు. పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుకు విజయం అందించారు. తాజా గెలుపుతో ఆయన మూడోసారి మండలిలో అడుగుపెట్టనున్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిచిన టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు తొలినుంచీ రఘువర్మకు మద్దతుగా ప్రచారం చేపట్టారు. ఆ తరువాత టిడిపి, జనసేన ప్రజాప్రతినిధులంతా పాఠశాలలకు వెళ్లి మరీ ప్రచారం నిర్వహించారు. అయినప్పటికీ అత్యధిక మంది ఉపాధ్యాయులు రఘువర్మవైపు కన్నెత్తి చూడలేదు. రెండో ప్రాధాన్య ఓట్ల లెక్క తేలేసరికి తుదకు 710 ఓట్ల ఆధిక్యతతో గాదె టీచర్ ఎమ్మెల్సీ విజేతగా నిలిచారు.

తొలి రౌండ్ నుంచీ గాదె ఆధిక్యం

ఈ ఎమ్మెల్సీ స్థానానికి పోలైన 20,791 ఓట్ల లెక్కింపు ప్రక్రియ విశాఖలోని ఆంధ్రా యూనివర్శిటీ ఇంజినీరింగ్ కాలేజీలోని ట్రిపుల్ 'ఇ' విభాగంలో ఉదయం 8 గంటల నుంచి సాగింది. పోలైన వాటిలో చెల్లనవి 656 ఉన్నాయి. దీంతో 20135 ఓట్లను పరిగణనలోకి తీసుకున్న అధికారులు లెక్కింపు కొనసాగించారు. సాయంత్రం 7.30 గంటల వరకూ 8వ రౌండ్ ముగిసేనాటికి పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి 5900 ఓట్లు (ఎలిమినేట్ అయ్యారు), పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుకు 7272 ఓట్లు, టిడిపి, జనసేన మద్దతునిచ్చిన ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు 6905 ఓట్లు పోలయ్యాయి. 9వ రౌండ్ (ఆఖరి రౌండ్)లో గాదె శ్రీనివాసులనాయుడుకు 9237, పాకలపాటి రఘువర్మకు 8527 ఓట్లు దక్కి మొదటి, రెండో స్థానాల్లో నిలిచారు. దీంతో 20135 ఓట్లను లెక్కించినట్టయింది. 710 ఓట్ల (రెండో ప్రాధాన్యత)తో గాదె గెలుపొందారు. తొలి రౌండ్ నుంచీ గాదె శ్రీనివాసులనాయుడు మొదటి ప్రాధాన్య ఓటులో అగ్రభాగాన నిలుస్తూ వచ్చారు. ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పది మంది బరిలో నిలిచినా పై ముగ్గురి మధ్యనే పోటీ నడిచింది. అభ్యర్థుల్లో 15 ఓట్లలోపు వచ్చిన వారిలో పద్మావతి, శివప్రసాద్ ఉన్నారు.

తాజా ఫలితాలు ఏం చెబుతున్నాయి ?

కొద్ది నెలలకే కూటమిపై గురువుల్లో వెగటు పుట్టిందా ? అంటే అవుననే రీతిలో ఫలితాలు ఉన్నాయి. పాకలపాటి రఘువర్మ గెలుపుకోసం ఉత్తరాంధ్ర అంతటా అధికార కూటమిలోని టిడిపి, జనసేన ప్రజాప్రతినిధులు, నాయకులు మద్దతు ప్రచారాలు చేశారు. ఇలా ఉపాధ్యాయ ఎన్నికను రాజకీయం చేయడం టీచర్లలో వ్యతిరేకతను పెంచినట్లు ఫలితాలను బట్టి స్పష్టమవుతోంది. తరతమ స్థాయిల్లో ప్రలోభాలు, బెదిరింపులూ సాగాయి. తుదకు రఘువర్మను గురువులు ఓడించారు. విజేతగా నిలిచిన గాదె శ్రీనివాసులనాయుడు కూడా ప్రలోభాలు పెట్టినట్టు వార్తలు వచ్చాయి. ఏదేమైనప్పటికీ ఆయన విజేతగా నిలిచారు. పిడిఎఫ్ అభ్యర్థి మాత్రమే ఈ ఎన్నికల్లో నిజాయితీగా మాట్లాడి, విలువలకు ప్రాధాన్యతనిచ్చి, ఒక్కపైసా కూడా ఖర్చు పెట్టకుండా సమరంలో నిలిచి చెప్పుకోదగ్గ ఓట్లు సాధించారన్న చర్చ కూడా ఉపాధ్యాయుల్లో నడుస్తోంది.

ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న ఆర్ఒ హరేంధిర ప్రసాద్

ఓడినా, గెలిచినా ఉపాధ్యాయుల మధ్యనే : కోరెడ్ల విజయగౌరి

గెలుపోటములు అనేవి సహజమని, గెలిచినా ఓడినా ఉపాధ్యాయుల మధ్యనే ఉండి పనిచేస్తానని పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఈ ఫలితాలపై స్పందించారు.

తీర్పును స్వాగతిస్తున్నాను: రఘువర్మ

టీచర్ల తీర్పును స్వాగతిస్తున్నానని ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ అన్నారు. ఫలితాల అనంతరం ఆయన స్పందించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : శ్రీనివాసుల నాయుడు

'నన్ను నమ్మి గెలిపించిన ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా. వారి సమస్యలను మండలిలో లేవనెత్తి పరిష్కరించేందుకు కృషి చేస్తా' అని విజేతగా నిలిచిన పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసుల నాయుడు అన్నారు.

సర్వత్రా ఉత్కంఠ

- కొనసాగుతున్న గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- రాత్రి 8 గంటలకు 50 ఓట్ల చొప్పున కట్టలు కట్టడం పూర్తి
- కౌంటింగ్ ఆలస్యంతో టిడిపి, పిడిఎఫ్ నేతల్లో టెన్షన్
- పోలైన పోస్టల్ ఓట్లు 243లో 201 చెల్లుబాటు
- రౌండ్‌కు 28 వేల ఓట్ల చొప్పన 8 రౌండ్లలో కౌంటింగ్ పూర్తికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉత్కంఠ రేపుతోంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మందకొడిగా సాగడంతో టిడిపి, పిడిఎఫ్ నేతలు, కార్యకర్తల్లో టెన్షన్ నెలకొంది. సోమవారం ఉదయం ఏడు గంటలకు సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లను తెరిచారు. బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ గదిలోకి చేర్చి ఉదయం ఎనిమిది గంటలకు లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. మొత్తం 28 టేబుల్స్ ఏర్పాటు చేయగా ప్రతి రౌండ్‌లోనూ 10 నుంచి 13 వేల ఓట్లకు సంబంధించి కట్టలు కట్టడం ప్రారంభించారు. చెల్లుబాటు, చెల్లుబాటు కానివాటితో సంబంధం లేకుండా 50 ఓట్ల చొప్పున కట్టలుగా కట్టారు. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 35 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకు మొదలుపెట్టిన కట్టలు కట్టే ప్రక్రియ రాత్రికి 17 రౌండ్లలో పూర్తయ్యింది. ఆ తర్వాత ప్రాధాన్యతా ఓట్ల క్రమంలో లెక్కింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. మంగళవారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో లెక్కింపు పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మూడు షిప్టులుగా మొత్తం 700 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డిఆర్ఒ విశ్వేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు నిరంతరం కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ మొత్తంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతిఒక్కరినీ తనిఖీ చేసి పాసులు ఉన్నవారిని మాత్రమే లోపలికి పంపించారు.

కృష్ణా, గుంటూరు స్థానంలో వేగంగా.. ఇక్కడ ఆలస్యంగా..

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు జరిగాయి. అక్కడ సైతం సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు మొదలైంది. అక్కడ 25 మంది అభ్యర్థులు బరిలో ఉండగా దాదాపు 3.40 లక్షల ఓట్లు పోలయ్యాయి. అక్కడ ఓట్ల లెక్కింపు వేగంగా జరగడంతో సాయంత్రం ఐదు గంటల నుంచి రౌండ్లవారీగా ఫలితాలు ప్రకటించడం ప్రారంభమైంది. ఇక్కడ మాత్రం కట్టలు కట్టడానికే దాదాపు 12 గంటల సమయం పట్టింది. దీంతో అక్కడ వేగంగా జరగడానికి, ఇక్కడ ఆలస్యం జరగడానికి కారణాలు ఏమిటని ప్రశ్నలు అందరినీ తొలిచేశాయి. కౌంటింగ్ ప్రక్రియ మందకొడిగా సాగుతుందనే విమర్శలు వెల్లువెత్తాయి. రాత్రి ఎనిమిది గంటల తర్వాత కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవ్వడంతో ఏజెంట్లు, అభ్యర్థులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. మొత్తం 28 టేబుల్స్ ఉండగా ప్రతి రౌండ్‌కూ టేబుల్‌కు వెయ్యి చొప్పున 28 వేల ఓట్లు లెక్కించనున్నారు. మొత్తం ఎనిమిది రౌండ్లలో పూర్తిస్థాయి ఫలితం వెలువడనున్నట్లు అధికారులు చెబు తున్నారు. పూర్తిస్థాయి ఫలితం వచ్చేటప్పటికి సమయం ఎక్కువ పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పోస్టల్ ఓట్లు 201 చెల్లుబాటు

పోస్టల్ ఓట్లకు సంబంధించి 408 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 243 మందే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 201 ఓట్లు చెల్లుబాటయ్యాయి. 42 ఓట్లు చెల్లుబాటు కానివిగా తేల్చారు.

టిడిపి, పిడిఎఫ్ నేతల్లో ఉత్కంఠ

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో టిడిపి, పిడిఎఫ్ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. గెలుపుపై ఎవరి అంచనాలు వారు వేస్తున్నారు. ఎవరికివారు గెలుపుపై ధీమాగా ఉన్నారు.

దీపం 2 పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయండి

- గ్యాస్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు - జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: దీపం 2 పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. దీపం పథకంలో గ్యాస్ సరఫరాదారులు అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఐటిడిఏ పి.ఓలు, సబ్ కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులు, గ్యాస్ కంపెనీలు, గ్యాస్ పంపిణీ దారులతో దీపం 2 పథకం అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లబ్ధిదారులు గ్యాస్ తీసుకున్న తరువాత 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాలో నగదు చెల్లింపులు జమ చేయాలని స్పష్టం చేసారు. ఉచిత గ్యాస్ పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోందన్నారు. గ్యాస్ పంపిణీలో అవక తవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ, గ్యాస్ డెలీవరీ బాయ్స్ అదనపుంగా వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీ పరిధిలో 15 కిలోమీటర్ల వరకు ఉచితంగా గ్యాస్ పంపిణీ చేయాలని చెప్పారు. 15 కిలో మీటర్లు దాటితే రూ.30లు రవాణా చార్జీలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు ఉచిత గ్యాస్ నగదు 48 గంటల్లో జమ కాకపోతే టోల్ ఫ్రీ నంబరు 14400 లేదా 1967 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్లను అన్ని గ్యాస్ ఏజెన్సీలో ప్రదర్శించాలని సూచించారు.

జిల్లాలో దీపం 2 పథకంలో 11433 కనెక్షన్లలో 61 కనెక్షన్లు వినియోగంలో లేవని అన్నారు. వాటికి ఇకెవైసీ చేసి వినియోగంలోకి తీసుకుని రావాలన్నారు. అదనపు వసూళ్లు చేస్తే గ్యాస్ ఏజెన్సీలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులందరకి ఇకెవైసీ చేయాలన్నారు. లబ్ధిదారులకు గ్యాస్ డెలీవరీ బాయ్స్ ఇకెవైసీ చేయాలన్నారు. లేదా మీ సేవా కేంద్రాలలో ఇకెవైసీ చేయించుకోవాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా పౌర సరఫరాల అధికారి బి.గణేష్, ఐఓసీ, హెచ్పిసిల్ అధికారులు, గ్యాస్ డీలర్లు,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీశాఖ అధికారులు

వన్య ప్రాణులు, అడవులను సంరక్షించాలి

ప్రజాశక్తి-గంగవరం

వన్యప్రాణులను, అడవులను సంరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని విద్యార్థులకు ఎఫ్ఎస్ఓలు బి.నూకరాజు, ఎస్.వరలక్ష్మి సూచించారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా గంగవరం మండల కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లు మానవులకు, వన్యప్రాణులకు జీవనాడి అని, అటువంటి చెట్లను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. చెట్లును నరకరాదని, వన్యప్రాణులను వేటాడరాదని విద్యార్థులతో వారు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బిఓలు ఎం ప్రశాంత్ కుమార్, పి అరుణ, ఎల్బీ మాణిక్యం, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమిష్టి పోరాటంతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-గంగవరం

ఆదివాసీ గౌడులంతా సమిష్టిగా పోరాటం చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఆదివాసీ గౌడ్ సంఘాల అధ్యక్షులు మట్టా రామ్మూర్తి గౌడు, నాయకులు కొప్పుల నాగరాజు గౌడు పిలుపునిచ్చారు. గంగవరంలో రెండు జిల్లాల ఆదివాసీ గౌడ్ సంఘాల నాయకులు అత్యవసర సమావేశం సోమవారం జరిగింది. తమ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ విషయంలో జరుగుతున్న జాప్యాన్ని పరిష్కరించుకునేందుకు నిర్వహించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత విశాఖ, విజయనగరం, మన్యం ప్రాంతాల్లో గౌడ్‌లకు అందిస్తున్న కులధ్రువీకరణ పత్రాలను తమకు ఇవ్వడంలో ఇక్కడ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను తాము పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే ఉన్న జీవోలను అమలు చేసి తమకు గౌడు ఎస్టీ సర్టిఫికెట్లను మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పంబి అప్పలస్వామి గౌడు, కుప్పల దుర్గారావు, మట్ట రాజు, గూడవల్లి ప్రభాకర్, నండూరి సూర్య భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ గౌడ్ సంఘం నాయకులు

సాగుల ఘాట్ రోడ్డులో జీపు దగ్ధం

- వృద్ధుడు మృతి
- ఒక మహిళ పరిస్థితి విషమం
- మరో 10 మంది ప్రయాణికులకు గాయాలు

ప్రజాశక్తి-సీలేరు, చింతపల్లి

జికె.వీధి మండలం సాగుల ఘాట్ రోడ్డులో జీపు బోల్తా పడి దగ్ధమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందగా, ఒక మహిళ పరిస్థితి విషమంగా ఉంది. మరో 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం... గూడెం కొత్త వీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధి ఎర్రగడ్డ గ్రామస్తులు 14 మంది సోమవారం ఆర్వి నగర్ వారపు సంతకు జీపులో బయలుదేరారు. సాగులు ఘాట్ రోడ్డు ఎక్కుతుండగా నాల్గవ మలుపు వద్ద జీపు టైర్ పేలిపోయి, అదుపు తప్పింది. దీంతో జీపును డ్రైవర్ అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ బ్రేకులు పట్టకపోవడంతో ప్రయాణికులతో ఉన్న జీపు బోల్తా పడి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. జీపులో ఉన్న ప్రయాణికులు ప్రాణాలను రక్షించుకునే ప్రయత్నం చేశారు. అయితే ఎర్రగడ్డ గ్రామానికి చెందిన మర్రి వెంకట్రావు (70) మంటలు తాకిడికి అక్కడక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అదే గ్రామానికి చెందిన కొర్ర పెంగో (65) అనే మహిళ పరిస్థితి విషమంగా ఉంది. మరో 10 మందికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను సంఘటన స్థలం నుంచి 108 వాహనంలో గూడెం కొత్తవీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉన్న కొర్ర పెంగోను మెరుగైన వైద్య సేవలు నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. జీపు డ్రైవర్ అప్పారావును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వరప్రసాద్ తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణం చేయడమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

మంటల్లో కాలిపోతున్న జీపు

సంఘటనా స్థలంలో వెంకటరావు మృతదేహం

ఏజెన్సీలో పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం నియోజకవర్గంలోని పలు పాఠశాలలకు ప్రహరీలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారని, తక్షణమే ప్రహరీలు నిర్మించాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని 11 మండలాల్లో సుమారు 500 పాఠశాలలకు నేటికీ ప్రహరీ గోడలు లేవని తెలిపారు. సుమారు 80 గ్రామాలకు పాఠశాలలు కూడా లేవన్నారు. సుమారు 150 పాఠశాలలు శిథిలావస్థకు చేరుకుని స్లాబు పెచ్చులూడి విద్యార్థులపై పడుతున్న పరిస్థితులు ఉన్నాయని, దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందని భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. దీంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపకుండా తమతో పాటు వ్యవసాయ పనులు తీసుకెళ్లిపోతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న పాఠశాలల భవనాలను పడగొట్టి నాడు- నేడు పేరుతో సగం సగం నిర్మాణం చేశారని తెలిపారు. పాఠశాల భవనాలు లేని గ్రామాలలో తల్లిదండ్రులే తాటాకు పాకలను వేసి తమ పిల్లలను బడికి పంపిస్తున్నారని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు సైతం తమ జీతాల్లోని కొంత భాగాన్ని తీసి పాఠశాలలకు మరమ్మతులు చేయించి విద్యా బోధన సాగిస్తున్నారని చెప్పారు. కనుక గత ప్రభుత్వ హయాంలో జరిగిన నాడు -నేడు పనులపై విజిలెన్స్ ఎంక్వైరీ వేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గిరిజన గ్రామాల్లో పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మించాలని కోరారు.

అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

కొండపల్లి పాఠశాల విలీనాన్ని ఆపాలి

- ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలం కొండపల్లి గ్రామపంచాయతీలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను మోడల్ పాఠశాలకు పంపించే ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని కోరుతూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు, కొండపల్లి గ్రామ సర్పంచ్ కుంజం జగన్నాథం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జగన్నాథం మాట్లాడుతూ మోడల్ స్కూల్లో విలీనం పేరుతో ఎంపీపీ పాఠశాలలను కనుమరుగు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలిపారు. ఇలా చేయడం వల్ల తమ గ్రామాల నుండి వెళ్లే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. కొండపల్లి గ్రామం రాజవొమ్మంగికి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం ఉంటుందని, మోడల్ స్కూల్‌కు రావాలంటే ఈ మార్గంలో ప్రమాదకరంగా ఉన్న చెరువులు, రెండు కాలువలను దాటాల్సిన పరిస్థితి ఉంటుందని తెలిపారు. జాతీయ రహదారి కూడా ఉందని, విద్యార్థులు రోడ్డు దాటే క్రమంలో విద్యార్థులు ప్రమాదాలకు గురై ప్రాణాలను సైతం కోల్పోయే పరిస్థితులు ఎదురవుతాయని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం ఈ పాఠశాలల విలీనాన్ని నిలుపుదల చేయాలని కోరారు.

మన్యం కొండ జాతరలో వైద్య శిబిరం

గుండెపోటుకు గురైన వ్యక్తికి అత్యవసర వైద్యం

ప్రజాశక్తి-సీలేరు

చింతూరు మండలం పొల్లూరు వాటర్ ఫాల్స్ వద్ద సోమవారం జరిగిన మన్యంకొండ జాతర సందర్భంగా యాత్రకు వచ్చిన ప్రజలకు అత్యవసర వైద్యం అందించేందుకు ఏపీ జెన్కో ఎస్సీ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు భవ్య ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏపీ జెన్కో ఆరోగ్య రథం సిఎస్ఆర్ అంబులెన్స్‌లో సిబ్బంది వైద్య సేవలు అందించారు. మన్యంకొండ జాతర తిలకించడానికి వచ్చిన ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా నివాసి రామేశ్వరపూజారి వాటర్ ఫాల్స్ వద్ద జాతర తిలకిస్తుండగా అకస్మాత్తుగా షుగర్ లెవెల్స్ పెరిగిపోయి హార్ట్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే వైద్య సిబ్బంది స్పందించి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యసేవలు నిమిత్తం అంబులెన్స్ డ్రైవర్ గణేష్, ఈఎంటి రవిచంద్ర చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. వైద్య సిబ్బంది రామేశ్వర పూజారికి సకాలంలో వైద్య సేవలు అందించడంతో ప్రాణహాని తప్పింది. విషయం తెలుసుకున్న ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి డ్రైవర్ గణేష్‌ను రవిచంద్రను అభినందించారు.

వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

పింఛన్ల పంపిణీలో మళ్లీ టాప్!

- వరుసగా ఏడు నెలలుగా మొదటిస్థానం
- హర్షం వ్యక్తం చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్
- అధికారులు, సచివాలయ సిబ్బందికి అభినందన

ప్రజాశక్తి -పాడేరు: ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో అల్లూరి సీతారామరాజు జిల్లా మళ్ళీ ప్రథమ స్థానం సాధించడంపై జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ హర్షం వ్యక్తం చేసి, సంబంధిత అధికారులను అభినందించారు. జిల్లాలో 1,22,907 మంది లబ్దిదారులకు పింఛన్లు విడుదల కాగా 1,21,453 మందికి పంపిణీ చేసి, 98.82 శాతం పంపిణీతో అల్లూరి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెలతోపాటు గడచిన ఏడు నెలలుగా పింఛన్ల పంపిణీలో అల్లూరి జిల్లా అగ్రస్థానంలో నిలవడంపై పింఛన్లు పంపిణీ చేసే సిబ్బందితోపాటు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల ఒకటో తేదీని రాత్రి 8.30 గంటలకు జిల్లా వ్యాప్తంగా 95.33 శాతం మంది లబ్దిదారులకు పింఛన్లు అందజేసిన సచివాలయ సిబ్బందిపై ప్రశంసలు కురుస్తున్నాయి. పింఛన్ల పంపిణీని నిరంతరం పర్యవేక్షించిన డిఆర్‌డిఎ పిడి వి.మురళిని కలెక్టర్ అభినందించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన ఎంపిడిఒలు, సచివాలయ సిబ్బందిని కలెక్టర్ ప్రశంసించారు. ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కోరారు.

కాగా జిల్లాలో దేవీపట్నం మండలం 99.34 శాతం పింఛన్ల పంపిణీతో మొదటి స్థానం సాధించగా, జి.కేవీధి మండలం 99.23 శాతంతో రెండవ స్థానం, ముంచింగిపుట్టు మండలం 99.20 శాతంతో మూడవ స్థానంలో నిలిచాయి. ఏటపాక మండలంలో 98.06 శాతం పింఛన్లు పంపిణీ చేసి ఆఖరి 22వ స్థానంలో నిలిచింది. దేవీపట్నం మండలంలో 4267 మంది లబ్దిదారులకు పింఛన్లు విడుదల కాగా 4239 మందికి, లజికే వీధి మండలంలో 7509 మందికిగాను 7451 మందికి, ముంచింగి పుట్టు మండలంలో 6139 మందికిగాను, 6090 మందికి పింఛన్లు పంపిణీ చేశారు.

'పది' విద్యార్థులకు పరీక్షా సామగ్రి

పరీక్షా సామగ్రి అందజేస్తున్న ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు, గన్నెల పాఠశాలల టెన్త్ విద్యార్థులకు ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. లోతేరు గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో 21 మందికి, గన్నెల గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 34 విద్యార్థులకు ప్యాడ్‌లు,పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ పట్టాసి దీప్తి మాట్లాడుతూ.విద్యార్థులు బాగా చదివి, పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ సెక్రెటరీ శ్రీనివాస్, వైస్ చైర్మన్ అప్పలస్వామి, మధు, విలేజ్ కోఆర్డినేటర్స్ రాజు, త్రినాథ్, మంగళయ్య, చినబాబు, ఆదిమూర్తి, పద్, సుబుద్ర, శాంతి కుమారి, పోర్తిమ, గున్నమ్మ, సుబ్బారావు, లోతేరు, గన్నెల పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్‌లు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధన దిశగా చేపడుతున్న చర్యల్లో భాగంగా సోమవారం నుంచి గ్రాండ్ టెస్ట్‌లు ప్రారంభమయ్యాయి. ఈనెల 17 నుంచి పబ్లిక్ పరీక్షలు జరగనుండగా, 13 వరకు గ్రాండ్ టెస్ట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండో ప్రీఫైనల్ పరీక్షగా పరిగణించే వీటిని తొలిసారిగా నిర్వహిస్తున్నారు. గతనెల 2 నుంచి 20 వరకు మొదటి ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించగా, గ్రాండ్ టెస్ట్ నిర్వహించి పేరుతో సోమవారం నుంచి రెండో ప్రీఫైనల్‌ను నిర్వహించి, విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేస్తున్నారు. జిల్లాలో 11564 మంది రెగ్యులర్, 202 మంది ప్రైవేటుగా మొత్తం 11766 మంది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. 3న తెలుగు, 4న హిందీ, 5న ఆంగ్లం, 7న గణితం, 10న భౌతికశాస్త్రం, 11న జీవశాస్త్రం, 13న సోషల్ పరీక్షలు జరుగుతాయి. ప్రతిరోజూ. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు గ్రాండ్ టెస్ట్‌నిర్వహిస్తారు.

నేడు యుడిఐడి కార్డులపై అవగాహన

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీలో మంగళవారం ఏఎస్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ, శబరి దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో యుడి ఐడి కార్డు, ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ కోఆర్డినేటర్ నేరుపటి రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులు ఈ సదస్సుకు హాజరై తమ సమస్యలు సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు. బ్యాటరీ సైకిల్, స్కూటీ, బస్సు పాస్, ఇతర అవకాశాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. యుడి ఐడి కార్డు కొరకు సదరం సర్టిఫికెట్, సదరం ఐడి, ఆధార్ కార్డు, బస్, రైల్వే పాస్‌ల కోసం పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్ జెరాక్స్ కాపీలు, పుట్టిన తేది సర్టిఫికెట్, బ్యాటరీ సైకిల్ కోసం సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు తీసుకొని రావాలని కోరారు. వివరాలకు శబరి దివ్యాంగుల సభ్యులను సంప్రదించాలని సూచించారు.

మార్కెట్లోకి 'హయర్ కినౌచి' ఏసిలు



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గృహోపకరణాల రంగంలో 16ఏళ్లుగా అగ్రగామిగా ఉన్న హయర్ హోం అప్లయన్సెస్, ప్రత్యేకమైన కలర్ ఫుల్ కినౌచీ ఎయిర్ కండిషనర్లను సోమవారం విశాఖపట్నం మార్కెట్లో విడుదల చేసింది. ఈ సందర్భంగా సంస్థ ఇండియా ప్రెసిడెంట్ ఎస్‌ఎస్..సతీష్ మాట్లాడుతూ వినియోగదారుల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ మూడు రంగుల్లో కినౌచి నూతన ఎయిర్ కండిషనర్లును గతనెల 27న దేశంలో విడుదల చేయగా, సోమవారం నుంచి విశాఖ మార్కెట్‌లో లభ్యమవుతాయన్నారు. ఎఐ శక్తితో కూడిన సూపర్ సోనిక్ కూలింగ్, 60 డిగ్రీల సెంటిగ్రేడ్ తీవ్రమైన ఉష్ణోగ్రతలోనూ కేవలం 10 సెకన్లలోనే 20 రెట్లు అధిక చల్లదనాన్ని ఇస్తుందని, ఫాస్ట్ సెల్ఫ్ క్లీన్ టెక్నాలజీ , 99.9శాతం స్టెరిలైజేషన్ చేస్తూ, నిమిషాల వ్యవధిలోనే ఆరోగ్యకరమైన గాలిని అందిస్తుందన్నారు. 5 స్టార్ రేటింగ్‌తో 1.6 టన్నుల హయర్ కినౌచిఎయిర్ కండిషనర్ ప్రారంభ ధర 49,990 గా నిర్ణయించామన్నారు.

5న ఇగ్నో స్నాతకోత్సవం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) 38వ స్నాతకోత్సవాన్ని ఈనెల 5న దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. న్యూఢిల్లీలోని ఇగ్నో కేంద్ర కార్యాలయంలో ఇగ్నో కులపతి ఆచార్య ఉమా కంజిలాల్ అధ్యక్షతన జరిగే ప్రధాన కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్నాతకోపన్యాసం చేస్తారు. అదే సమయంలో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 39 ప్రాంతీయ కేంద్రాలలో వేడుక జరగనుంది. విశాఖపట్నం మహిళా డిగ్రీ కళాశాల ప్రాంతీయ కేంద్రంలో సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మావు అధ్యక్షతన నిర్వహించే స్నాతకోత్సవంలో శ్రీకాకుళం అంబేద్కర్ విశ్వవిద్యాలయం, కులపతి, ఆచార్య కెఆర్. రజని పాల్గొని 1400మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, ముగ్గురికి బంగారు పతకాలను ప్రదానం చేస్తారు.

దళిత అధికారులపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిఐడి మాజీ డిజి పివి సునీల్‌కుమార్ సస్పెన్షన్ దారుణమని, దళిత అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు మానుకోవాలని అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా కార్యదర్శి గంట కనకరాజు, ఉపాధ్యక్షులు రెల్లి త్రినాథ్ డిమాండ్ చేశారు.

సోమవారం ఎల్‌ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద మిషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గత ప్రభుత్వంపై కక్షతో సునీల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవడం సరికాదని, వెంటనే సస్పెన్షన్ ఎత్తేయాలని కోరారు.

విరబూసిన కాగిత పూలు

- మంత్రముగ్ధులను చేస్తున్న మన్యం అందాలు
- పరవశులైపోతున్న ప్రకృతి, పర్యాటక ప్రేమికులు

ప్రజాశక్తి -సీలేరు : మన్యంలోని సహజసిద్ధమైన అందాలు ప్రకృతి ప్రేమికులను తన్మయులను చేస్తూ అమితానందానికి గురిచేస్తున్నా యనేది ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఏ సీజన్ కా సీజన్ కొంగొత్త అందాలు స్థానికులతో పాటు, ఈ ప్రాంత సందర్శనకు వచ్చే పర్యాటక ప్రేమికులను విశేషంగా ఆకర్షిస్తూ సంభ్రమాశ్చర్యాలను గురిచేస్తుంటాయి. అలాంటివే ప్రస్తుత శిశిరంలో ఎక్కడికక్కడే సాక్షాత్కరించే కాగిత పూలు సోయగం. పలువర్ణాలలో కాగితపూలు ఉన్నప్పటికీ, జికె.వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతంలో ఎరుపు గులాబీ వర్ణంలో విరబూసిన కాగిత పూలు ప్రత్యేకమనే చెప్పాలి. లతల్లా కనిపించే చిన్నపాటి మొక్కలకు కిందన ఆకుపచ్చ రంగులో ఆకులు, వాటి చిగురున ఎరుపు, గులాబివర్ణంలో బుట్టలా నిండా పూసిన కాగితపు పూలు చూపరుల మనసును దోచుకుని పరవశింప చేస్తున్నాయి. ఇక్కడ ఆకుపచ్చని ఆకులకంటే, ఎరుపురంగు పూలే ఎక్కువగా ఉండడంతో కొత్త అందాలు ఆవిష్కృతమౌతున్నాయి.

ఏటా జనవరి నెల నుంచి వికసించిన కాగితపూలు, మార్చినాటికి ఎరుపు, గులాబీ వర్ణంలో చెట్టు నిండా వికసిస్తాయి. ఇలాంటివే పలు మొక్కలు సీలేరు ప్రధాన రహదారి సమీపంలో యుసిఐఎం చర్చి ఆవరణలో నిండా విరబూసిన దశ్యాలు అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, పర్యాటకులకు మధురానుభూతిని కలిగిస్తున్నాయి. సీలేరు పరిసర ప్రాంతాల్లో చూడచక్కని ప్రకృతి అందాలెన్నో ఉండగా, వాటిలో కాగిత పూల అందాలు ప్రత్యేకమనే చెప్పాలి. మార్చి నెలాఖరునాటికి పూతకాస్తా కనుమరుగై, చెట్టునిండా ఆకుపచ్చదనం ఆవిష్కృతమౌతోంది. కాగితపూల అందాలను తనివితీరా ఆస్వాదిస్తున్న ప్రకృతి ప్రేమికులు వాటి అందాలను తమ సెల్‌ఫోన్లు, కెమెరాల్లో బంధించడంతోపాటు వాటివద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని సందడి చేయడం కనిపిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసే వాకర్స్ సైతం నిత్యం వీటిని చూస్తున్నా, ప్రతిరోజూ ఏదోఒక కొత్తదనం ఆస్వాదిస్తూ, పరశులవ్వడం విశేషం

ఎన్నో ఉన్నాయి. పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించి ప్రకతి దశ్యాలు తిలకించి వాటితో పాటు సీలేరు పరిసర ప్రాంతా అందాలు ఆస్వాదించి కెమెరాలో బంధించి ఎంతో అనుభూతిని పొందుతారు. కాగిత పూలు మార్చి చివరి నాటికి పుత కనుమరుగై చెట్టునిండా చిగురించి పచ్చదనంతో కలకలాడుతుంది. కాగిత పూలు అపురూప అందాలు ప్రధాన రహదారి పై ఉదయం సాయంత్రం వాకింగ్ చేసే వాకర్ సైతం అందాలను ఆస్వాదిస్తున్నారు.



సీలేరు యుసిఐఎం చర్చిలో కాగితపూలు చెట్టు

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజున 144 మంది గైర్హాజరు
- ఒకేషనల్ పరీక్షకు 80 మంది విద్యార్థుల దూరం

ప్రజాశక్తి - పాడేరు టౌన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. సెకండ్ లాంగ్వేజ్ పేపర్ -2 కు 5,454 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 5,310 (97.36శాతం) మంది హాజరయ్యా రని, మిగిలిన 144 మంది గైర్హాజరయ్యారని డిఐఇఒ కె.అప్పలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఒకేషనల్ రెండవ సంవత్సరం పరీక్షకు 1,215 మంది హాజరుకావాల్సి ఉండగా 1,135 (98.42శాతం) మంది హాజరయ్యారని, మిగిలిన 80 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మరో పక్క ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలకు మొదటి రోజైన సోమవారం 1,563 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1,302 (83.30శాతం) హాజరయ్యారని మిగిలిన 261 మంది గైరాజరయ్యారని డిఇఒ పి.బ్రహ్మాజీ రావు తెలిపారు.

రాజవొమ్మంగి : ఇంటర్ సెకెండియర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాజవొమ్మంగిలోని ఎపిఆర్ బాలికల జూనియర్ కాలేజీ పరీక్ష కేంద్రాన్ని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా

సీలేరులో పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న స్క్వాడ్

అడ్డతీగలలో ఇంటర్ పరీక్షా కేంద్రం సందర్శనలో ఐటిడిఎ పిఒ సింహాచలం

సింహాచలం సందర్శించి, పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరుతోపాటు కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించి తగు సూచనలు చేశారు.విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రాజవొమ్మంగి పిహెచ్‌సిని సందర్శించారు. సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న వైద్యసేవలు, మందుల నిల్వలపై ఆరా తీశారు. గర్భిణులకు ఆరోగ్యపరీక్షలపై సూచనలు చేశారు

అడ్డతీగల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీను ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం సందర్శించి, లో ఇంటర్ సెకెండియర్ పరీక్షలను పర్యవేక్షించారు. ఈ కేంద్రంలో 272 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా, 24మంది గైర్హాజరై, 248 మంది హాజరయ్యారని సిఎస్ స్వామి, డిఒ ఎస్ రమేష్ తెలిపారు తహశీల్దార్ సూర్యారావు, ఎంపిడిఒ విజయ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

సీలేరు: సీలేరు జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకెండియర్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రంలో 49మంది విద్యార్థులకుగాను 45మంది పరీక్షలకు హాజరుకాగా, నలుగురు గైర్హాజరయ్యారు.ఫ్లయింగ్ స్క్వాడ్, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ ఆకస్మిక తనిఖీ చేశారు. విఆర్ఒ స్వరూప పాల్గొన్నారు.

గొంతెండిపోతోంది..

- తాగునీటి సమస్యపై సూకుడుపుట్టు గిరిజనుల ఆందోళన
- అధికారుల నిర్లక్ష్యంపై ఖాళీ బిందెలతో వినూత్న నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని వేంగడ పంచాయతీ పరిధి సూకుడుపుట్టు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గిరిజనులు ఖాళీ బిందెలతో సోమవారం ఆందోళన చేపట్టారు. పీసా కమిటీ సభ్యులు మజ్జి. రామన్న, గ్రామస్తులు మాట్లాడుతూ,గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రెండు సంవత్సరాల క్రితం పాడేరు ఐటీడీఏ, వెలుగు ప్రాజెక్ట్ ద్వారా ట్యాంక్ ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా ఇంటింటి కుళాయి ఏర్పాటు చేశారని తెలిపారు. పైపులైన్లు మరమ్మతుకు గురవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, దీంతో గిరిజనులు తాగునీటి సమస్యతో తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న నాధుడే కరువయ్యారని, ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి మరమత్తు పనులు చేపట్టి తాగునీటి సరఫరా చేయాలని కోరారు. లేని పక్షాన మండల కేంద్ర వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు

ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న సూకుడుపుట్టు గిరిజనులు

అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై నేటి నుంచి ధర్నాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అసంఘటిత కార్మికుల సమస్యలపై ఈనెల 4 నుంచి 8 వరకు రంగాలవారీగా ప్రతిరోజూ ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నాలు చేయనున్నట్లు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు తెలిపారు.

సోమవారం అల్లిపురం నీలం రాజశేఖర్ రెడ్డి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, సమావేశంలో ఆయన మాట్లాడుతూ,.4న ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, 5న ఆటో రిక్షా కార్మిక సంఘం, ఆటో ఫెడరేషన్, 6న జిల్లా ముఠా, సివిల్ సప్లయ్ కార్మిక సంఘాలు, 7న జిల్లా కాంట్రాక్ట్ లేబర్ యూనియన్, వాల్తేరు డివిజన్ కాంట్రాక్ట్ వర్కర్స్, హిందూజా పవర్ ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్. శ్రావణి షిప్పింగ్ కళాసీల సంఘం, 8న వీధి విక్రయదారులు, చిరు వ్యాపారాల సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు జరుగుతాయని, వీటికి కొనసాగింపుగా 11న మహాధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.

కనీస వేతనాలు రూ.35 వేలు, పిఎఫ్ ఇఎస్ఐ, గ్రాట్యుటి, సెలవులు అమలు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ విధానం రద్దు, జిఒ 21,31 రద్దు, కార్మిక సంక్షేమబోర్డు ఏర్పాటు, ఫార్మా కంపెనీల్లో ప్రమాదాల నివారణ, ప్రమాదాల్లో చనిపోయిన ఫార్మా కార్మికులకు కోటి పరిహారం, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు తదితర సమస్యలపై ఆందోళన చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షులుఎం.మన్మధరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటరావు, ఉపాధ్యక్షులు ఎస్‌కె రహమాన్,కార్యదర్శి పడాల గోవిందు, సిహెచ్ కాసుబాబు, ఎన్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యార్థులు, నిరుద్యోగులకు వంచన

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : విద్యార్థుల సంక్షేమాన్ని నిర్వీర్యం చేస్తూ,విద్యా రంగంలో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకోవడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు ఉన్నాయనిపిడిఎస్ఓ జిల్లా అధ్యక్షులు పి. విశ్వనాథ్ ఆక్షేపించారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పిడిఎస్ఒ ఆధ్వర్యంలో బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. కొఠారి కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా దేశ జిడిపిలో 6 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా అలా చేయలేదన్నారు .ఉన్నత విద్య, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించకుండా, వేద విద్యకు ప్రత్యేక నిధులు కేటాయింపు, యుజిసి పేరుతో విద్య కేంద్రీకరణకు చర్యలు, కార్పొరేట్లకు ఊతమిస్తూ, రాష్ట్ర స్వయంప్రతిపత్తిని హరించడం వంటి చర్యలకు పూనుకుందన్నారు. పిడిఎస్ఒ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మీ,మాట్లాడుతూ రాష్ట్రం బడ్జెట్‌లో పాఠశాల విద్య కేటాయింపులు ఉద్యోగుల వేతనాలు,అలవెన్సులకు మాత్రమే సరిపోతాయన్నారు. తల్లికి వందనం పథకానికి అరకొర కేటాయింపులు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సతీష్, జానకి,రాకేష్,లక్ష్మణ్,శివ, మణీంద్ర పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడు దుర్మరణం

మృతుడు భానుచందర్

ప్రజాశక్తి-చింతపల్లి: నిమ్మలపాలెం ఘాట్‌రోడ్‌లో బైక్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో గిరిజనుడు దుర్మరణం పాలైన ఘటన చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ నిమ్మలపాలెం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బైక్ అదుపుతప్పి బోల్తా పడడంతో పాంగి భానుచందర్ మృతి చెందాడు. చింతపల్లి మండలం గొందిపాకల పంచాయతీ చెందిన వెనం గ్రామస్తుడు భానుచందర్ భార్యతో కలిసి బైక్‌పై వెళుతుండగా, నిమ్మలపాలెం గ్రామ సమీపానికి బైక్ అదుపుతప్పడంతో రహదారి చివర్లో ఉన్న గోతులోకి పడిపోయాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భర్త భానుచందర్ రక్షించుకునేందుకు ఆతని భార్య ప్రమాద ఘటన నుంచి బయటకు తీసుకువచ్చి అంబులెన్స్ సహాయంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భానుచందర్ మృతదేహానికి పంచనామ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భానుచందర్ మృతితో వెనం గ్రామంలో విషాదం అలుముకుంది.

కనీస వేతనాలు చెల్లించాలి

సిఐటియు ఆధ్వర్యాన కార్మికుల నిరసన

సిఐటియు ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్ : అల్లూరి సీతారామరాజులో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి జె.భగత్ రామ్ డిమాండ్ చేశారు. సోమవారం అరకులోయ మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు అనంతరం ఎంఈఓ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి జన్ని భగత్ రామ్ మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికులకు, శానిటేషన్ వర్కర్ ల కు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలన్నారు. వేతనాలు ఒకటో తేదీకి అందించాలని, వంట చేయడానికి గ్యాస్ సిలిండర్లు, వంట సరుకులు ప్రభుత్వమే అందించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వంట సామాన్ల బిల్లులు పెంచాలన్నారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు, మధ్యాహ్న భోజన కార్మికులు పి దామోదర్, జె.రాము, జి.చిట్టి, జె సుమిత్ర, పి లక్ష్మి, మంగ్లీ, కార్మికులు పాల్గొన్నారు.

14 నుంచి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం పెదవలస పంచాయతీ రంపుల గ్రామంలో ఈ నెల 14, 15, 16, 17 తేదీలలో గాముకొండ మల్లేశ్వరి తీర్ధ మహొత్సవం సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కంకిపాటి గిరిబాబు, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వాల్‌బాల్ పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ పేర్లు ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలో పలు గ్రామాల నుంచి మాత్రమే క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు నరేష్, దొరబాబు 75692600021, 9381910443, 8688797162 పోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

జిల్లాలో తాగునీటి ఎద్దడి లేదు!

- ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి జవహర్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో ప్రస్తుతం తాగునీటి ఎద్దడి లేదని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే 08935 298900 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి కె.ఎస్ జవహర్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలోని 427 గ్రామ పంచాయతీలలో 4,860 ఆవాసాలు ఉన్నాయని, అందులో సుమారు 10,38,000 జానాభా నివశిస్తున్నారని తెలిపారు. వీరికి రక్షిత మంచి నీరు అందించడమే లక్ష్యంగా గ్రామీణ నీటి సరఫరా విభాగం కృషి చేస్తోందని డిఆర్ఇఒ స్పష్టం చేసారు. ఫిబ్రవరి ఒకటవ తేదీ నుండి ప్రారంభమైన సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం కింద జిల్లా వ్యాప్తంగా ఉన్న 19 సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాలను పరిశీలించడం జరిగిందని, అన్ని పథకాలు పని చేస్తున్నాయన్నారు. 2,237 పిడబ్ల్యుఎస్ పథకాలకు గాను ఇప్పటివరకు 1,568 పథకాలు పరిశీలించి అవసరమైన పథకాలకు మరమ్మత్తులు చేపట్టడం జరిగిందన్నారు. మిగిలిన పథకాలను ఈ నెల 15వ తేదీలోపు పరిశీలించి మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న 727 ఎంపిడబ్ల్యుఎస్ పథకాలను పరిశీలించి అవసరమైన మరమ్మతులు పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 9,057 హేండ్ పంపులు ఉండగా 334 గ్రామ పంచాయతీలలో 6,068 చేతిబోర్లను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేశామని, మిగిలినవి ఈ నెల 15వ తేదీలోపు పరిశీలిస్తామని తెలిపారు. ప్రతీ నెలలో మొదటి మూడవ శనివారం ప్రతీ నీటి వనరులను శుభ్రం చేయడం, ప్రతి రోజూ క్లోరినేషన్ చేయడం ఆయా గ్రామ పంచాయితీల అధ్వర్యంలో అధికారుల సమక్షంలో చేయడం జరుగుతుందని వివరించారు.

విశాఖ రైల్వేస్టేషన్‌లో డిఆర్‌ఎం తనిఖీలు

విశాఖ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డిఆర్‌ఎం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌ను వాల్తేరు డిఆర్‌ఎం లలిత్ బోహ్రా సోమవారం ఉదయం సమగ్రం తనిఖీ చేశారు. జ్ఞానాపురం వైపు స్టేషన్‌లోని కంప్యూటరైజ్డ్ రిజర్వేషన్ కార్యాలయం, ప్లాట్ ఫారాలు, క్యాటరింగ్ స్టాల్స్, పార్శిల్ కార్యాలయాలను పరిశీలించారు. స్టేషన్‌లో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. నూతన కోచింగ్ కాంప్లెక్స్ ను పరిశీలించి, పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

ఆంధ్ర వైద్యకళాశాలను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర మెడికల్ కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని కొత్తగా ప్రిన్సిపల్, డాక్టర్ కెవిఎస్ఎన్ సంధ్యాదేవిని ఐఎంఎ విశాఖ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ కేతా ఫణీంద్ర కోరారు. సోమవారం డాక్టర్ సంధ్యాదేవిని తన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి, అభినందనలు తెలిపారు.

ఎంసి ప్రిన్సిపల్‌ను అభినందిస్తున్న ఫణీంద్ర